సాక్షి పెద్దపల్లి

సోమవారం ၊ 14 ၊ ఆగస్టు ၊ 2023



మల్లన్నస్వామికి భక్తుల బోనాలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధికి భక్తులు ఆదివారం భారీగా తరలివచ్చారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. బోనం చేసి నైవేద్యంగా సమర్పించారు.



చెరువులు నిండుగా..'బీడు' పచ్చగా

పక్షం రోజులపాటు విస్తారంగా కురిసిన వర్షాలతో జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో సమృద్ధిగా నీరు చేరింది. జల వనరులన్నీ నిండుకుండలా మారాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా పొడి వాతావరణం ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గాంధీ చిత్రాన్ని తిలకించండి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని సినిమాహాళ్లలో జాతిపిత మహాత్మగాంధీ చలనచిత్రాన్ని ఉచితంగా ప్రదర్శిస్తారని, అందరూ తిలకించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. స్వాతంత్ర వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 14 నుంచి 24 వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని, విద్యార్థుల్లో జాతీయ స్ఫూర్తిని పెంపొందించేలా గాంధీ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. 14న ఉదయం 8 గంటల నుంచి 11.30 వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని, 15న స్వాతంత్ర్య దినం, 20న ఆదివారం కావడంతో చిత్ర ప్రదర్శన ఉండదని పేర్కొన్నారు. 16 నుంచి 24 వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30గంటలకు వరకు జిల్లాకేంద్రంలోని సంగీత, శ్రీనివాస, గోదావరిఖనిలోని రాజేష్, న్యూఅశోక, శ్రీనివాస, ఊర్వశి థియేటర్ చిత్ర ప్రదర్శన ఉంటుందని వివరించారు.

నిండుకుండలా ఎల్లంపల్లి



పూర్తి స్థాయి నీటిమట్టంతో ఎల్లంపల్లి

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఆదివారం నీటిపారుదలశాఖ అధికారుల ప్రకటన మేరకు.. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 19.17 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 4,157 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అంతే మొత్తంలో ఒక గేటు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు.

20 వరకు ప్యాసింజర్ రైళ్లు రద్దు



రామగుండం: ట్రాక్ పునరుద్ధరణ, సాంకేతిక కారణాలతో కాజీపేట–బల్లార్షా సెక్షన్ల మధ్య నడిచే పలు ప్యాసింజర్ రైళ్లను ఈనెల 20వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. ఇందులో కరీంనగర్–కాగజ్‌నగర్ పుష్‌పుల్, భద్రాచలంరోడ్–బల్లార్షా, సింగరేణి, కాజీపేట–బల్లార్షా మధ్య ఇరువైపులా రైళ్ల రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్టీఏ ఆఫీసుకు అద్దె భవనమే దిక్కు..

- సొంత భవన నిర్మాణానికి కరువైన స్థలం
- ఇక్కడ..అక్కడ..అంటూ కాలయాపన
- అవస్థలు పడుతున్న అధికారులు, ప్రజలు



పెద్దపల్లిరూరల్: జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయానికి అద్దెభవనమే దిక్కయింది. సర్కార్ ఖజానాకు ఏటా రూ.70కోట్ల వరకు ఆదాయాన్ని తెచ్చి పెడుతున్న ఆర్టీఏ కార్యాలయానికి సొంత భవనం నిర్మించుకునేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించడంలో రెవెన్యూ శాఖ అధికారులు అంతగా శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలున్నాయి. జిల్లా ఆవిర్భావానికి ముందే ఎంవీఐ ఆఫీసుగా ఉన్న కార్యాలయానికి ఎస్సారెస్పీ క్యాంపు ఆవరణలో రెండెకరాల స్థలాన్ని అప్పట్లోనే కేటాయించారు. భవన నిర్మాణానికి నిధులు కూడా సిద్ధంగా ఉన్నాయి. స్థలం హద్దులు నిర్ధారించే క్రమంలో రాష్ట్ర ఏర్పాటు, పెద్దపల్లి జిల్లాగా అవతరించడంతో ఎంవీఐ ఆఫీసు జిల్లా రవాణాశాఖ కార్యాలయంగా మారింది. ఆర్టీఏ కార్యాలయానికి అవసరమైన స్థలం కేటాయించాలంటూ సంబంధిత అధికారులు కలెక్టర్‌ను కలిసి పలుమార్లు విన్నవించారు. తహసీల్దార్లు రాఘవాపూర్ తదితర ప్రాంతాల్లో స్థల పరిశీలన చేశారు.

అరకొరవసతులు..అవస్థలు

అద్దెభవనంలో సరైన వసతులు లేక వచ్చిన వారంతా రాజీవ్‌రోడ్డు వెంట ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. సిబ్బందికి సరిపడా గదులు లేక తాత్కాలిక షెడ్లను వేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్పందించి స్థలం కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా సరుకులు.. పందికొక్కులపాలు



దుర్వాసన వస్తున్న బియ్యం నిల్వలు



ఐదేళ్ల క్రితం నిల్వ చేసిన చక్కెర సంచులు ఇలా..





రంధ్రాలుపడిన ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాం రేకులు



పందికొక్కుల తవ్వకాలతో గోడల పరిస్థితి..

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఫొటోలు జిల్లాకేంద్రంలోని ఎంఎల్‌ఎస్ (మండల్ లెవల్ స్టాక్) పాయింట్ గోదాంలోనివి. సివిల్ సప్లయ్ అధికారుల పట్టింపులేనితనంతో ప్రజలకు చేరాల్సిన బియ్యం.. గతంలో నిల్వ చేసిన చక్కెర ఇలా పందికొక్కుల పాలవుతున్నాయి. గోదాం రేకులకు రంధ్రాలుపడి వర్షానికి ఉరుస్తోంది. వర్షానికి తడవడం.. ఎండుకు ఎండుతూ బూజుపడుతున్నాయి. పందికొక్కులు తవ్వుతుండంతో గోడలన్నీ ధ్వంసమయ్యాయి. బియ్యాన్ని ఎలుకలు తింటూ.. లక్క పురుగులు పట్టి మొత్తంగా ఇదిగో ఇలా గోదాం అంతా అస్తవ్యస్తంగా మారింది. వర్షానికి బియ్యం తడిసి ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. వాసన భరించలేకపోతున్నామని కాలనీవాసులు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

కాంగ్రెస్ గెలుపునకు కృషిచేయాలి



మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

- ఒక్కసారి అవకాశం కల్పించాలి
- డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

పాలకుర్తి: రానున్న ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గంలో తన గెలుపు కోసం ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. ఆదివారం బసంత్‌నగర్ సమీపంలోని బుగ్గ పర్యాటకక్షేత్రం ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 25 ఏళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉంటున్నానని, నియోజకవర్గ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నానని, తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే అవినీతిలో కూరుకుపోయారని, ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల పేరిట కోట్లు దండుకున్నారని, బూడిద, ఇసుక, మట్టిమాఫియాకు కేరాఫ్‌గా నిలిచారని తెలిపారు. కార్యకర్తలు ప్రలోభాలకు లొంగకుండా పార్టీ పటిష్టతకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో మక్కాన్‌సింగ్ సతీమణి మనాలి ఠాకూర్, వివిధ గ్రామాల పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనంటేనే అంధకారం

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



యైటింక్లయిన్‌కాలనీ: అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ పాలన అంటేనే అంధకారం గుర్తొస్తుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఆదివారం రామగుండం కార్పొరేషన్ 17వ డివిజన్ సంతోష్‌నగర్‌లో భరోసా బస్తీ బాట చేపట్టారు. రూ.10లక్షల పట్టణ ప్రగతి నిధులతో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ అన్నివర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్పొరేటర్లు సాగంటి శంకర్, శంకర్ నాయక్, నాయకులు మేడి సదయ్య, రాంచందర్, రాకేశ్, కుమార్ నాయక్, సంధ్యారెడ్డి, ప్రశాంత్‌గౌడ్, బాలరాజు, శ్రీను, ఓదెలు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్లకు అభినందన

కరాటేలో మెడల్స్ సాధించిన యైటింక్లయిన్‌కాలనీ కేజీబీవీ విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. గతనెల 29, 30తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన ఓపెన్ కరాటే పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. వీరు సెప్టెంబర్ 9, 10 తేదీల్లో కేరళలో జరిగే పోటీలకు వెళ్లనున్నట్లు రామస్వామి పేర్కొన్నారు.

ప్రజాపోరాటానికే జీవితాన్ని అంకితం చేసిన గద్దర్

గోదావరిఖని: ప్రజా పోరాటాలకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు గద్దర్ అని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మాదాసి రామ్మూర్తి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, నాయకులు దేవ వెంకటేశం, పులి మోహన్, తోడేటి శంకర్‌గౌడ్, జూపాక శ్రీనివాస్, వేల్పుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో అభివృద్ధి శూన్యం

- మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ



రామగుండం: ఎత్తిపోతలను పరిశీలిస్తున్న సోమారపు సత్యనారాయణ

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్‌లో అభివృద్ధి కనిపించడం లేదని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక సీతానగర్‌లోని మార్కెట్‌ను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ప్రస్తుత మేయర్ నగర అభివృద్ధి పట్టించుకోవడం లేదని, తాను మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు ప్రజలకు సౌకర్యంగా ఉండేలా కూరగాయలు, మటన్, చికెన్, ఫిష్ మార్కెట్ ఒకేచోటకు తెచ్చామన్నారు. మరుగుదొడ్లు వాడుకున్నందుకు ఒక్కొక్కరి నుంచి రూ.10చొప్పున వసూలు చేయడం అన్యాయమన్నారు. టాయిలెట్స్ సౌకర్యం సరిగా లేదని, వర్షాలు కురిస్తే షాపులు మునిగిపోతున్నాయని వ్యాపారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట నాయకులు సోమారపు లావణ్య, మార్కెట్ సంఘం అధ్యక్షుడు దొంద మల్లేశ్, చికెన్ మార్కెట్ అధ్యక్షుడు రవికుమార్, దుబాసి లలిత, కోదాటి ప్రవీణ్, రాచకొండ కోటేశ్వర్, దాసరి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఐదేళ్లయినా ఎత్తిపోస్తలే..

రామగుండం: ఐదేళ్ల క్రితం ప్రారంభించిన బ్రాహ్మణపల్లి ఎత్తిపోతల పథకం పాలకుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతోందని సత్యనారాయణ అన్నారు. అంతర్గాం మండలంలోని బ్రాహ్మణపల్లి ఎత్తిపోతల పంపుహౌజ్‌ను ఆదివారం సందర్శించారు. తన హయాంలో 27 ఫిబ్రవరి 2018న రూ.75.74 కోట్ల వ్యయంతో 20వేల ఆయకట్టుకు 27ఎల్, 17ఎల్ కాలువల ద్వారా సాగు నీరు అందించేందుకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారని, నేటివరకు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. మోటార్లు, ప్యానల్స్, ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు పనులు ఇంకా మొదలుకాలేదన్నారు. పార్టీ నాయకుడు మాడ నారాయణరెడ్డి, పవన్, బోడకుంట జనార్దన్, సుభాష్, నరేష్, దేవేందర్, లగిశెట్టి తిరుపతి, ధర్ని సత్యం ఉన్నారు.

మూడు రోజుల్లో బూత్‌స్థాయి సమావేశాలు నిర్వహించాలి

గ్రామాల్లోని తటస్థ ఓటర్లను తరచూ కలుస్తుండాలని, మూడు రోజుల్లో బూత్ స్థాయి సమావేశాలు నిర్వహించాలని సత్యనారాయణ కార్యకర్తలకు సూచించారు. అంతర్గాం మండలంలో 27 పోలింగ్ కేంద్రాలున్నాయని, ఒక్కో కేంద్రానికి 30 మంది కార్యకర్తలతో మొత్తం 900 మంది గ్రామాల్లో నిత్యం పర్యటించాలని సూచించారు.

'మహారత్నా'లకు ధీటుగా సింగరేణి

- సంక్షేమానికి సింగరేణి పెద్దపీట
- అత్యాధునిక సౌకర్యాలపై నజర్
- ఒక్కో ఉద్యోగిపై ఏటా రూ.3.12లక్షల వెచ్చింపు
- సూపర్ స్పెషాలిటీ వైద్యానికి రూ.259కోట్లు
- కార్మికుల క్వార్టర్లకు ఉచిత విద్యుత్, ఏసీ సౌకర్యం



గోదావరిఖని: ఉద్యోగుల సంక్షేమానికి సింగరేణి యాజమాన్యం రాజీలేకుండా ముందుకు సాగుతోంది. ఏటా ఒక్కో కార్మికుడిపై సగటున రూ.3.12లక్షలు వెచ్చిస్తోంది. గతంతో పోల్చితే ఇది 150 శాతం ఎక్కువ. మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా కార్మికుల వారసులకు అవకాశం కల్పిస్తూ వారికి భరోసాగా నిలుస్తోంది. ఉద్యోగుల సౌకర్యాలపై ఖర్చుకు వెనుకడుగు వేయకుండా చర్యలు తీసుకుంటోంది. బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతతోపాటు సంక్షేమం, విద్య, వైద్యం, రోడ్లు, విద్యుత్, ఆరోగ్యం ఇలా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోంది.

విద్యుత్ ఉత్పత్తిలోనూ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంస్థ.. మహారత్న కంపెనీలకు ధీటుగా దూసుకెళ్తోంది. ఒకప్పుడు బొగ్గు ఉత్పత్తికే పరిమితంకాగా తాజాగా థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో కూడా రికార్డు నెలకొల్పుతోంది. భూగర్భగనుల్లో తట్టాచెమ్మాస్ కనుమరుగైంది. పూర్తిస్థాయి యాంత్రీకరణతో వందశాతం బొగ్గు ఉత్పత్తి దిశగా భూగర్భగనులు పోటీపడుతున్నాయి. యాంత్రీకరణ వేగవంతంకావడం.. నూతన ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతూ ఇప్పటికే 78మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే రోజుల్లో వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

క్వార్టర్ల నిర్మాణం, ఆసుపత్రుల ఆధునీకరణ, ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటు, గనుల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు, ఉద్యోగుల కాలనీల్లో ఆధునిక సౌకర్యాలు, కార్మికుల పిల్లల చదువులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇలా సంక్షేమంపై సింగరేణి నిధులు వెచ్చిస్తోంది. 2014–15లో ఉద్యోగిపై రూ.1.23లక్షలు ఉండగా 2021–22లో 150 శాతం పెరిగి రూ.3.12లక్షలకు చేరింది. కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా విదేశాల నుంచి ఆక్సిజన్ ప్లాంట్లను తెప్పించింది. రామగుండం, భూపాల్‌పల్లి, కొత్తగూడెం, మందమర్రి, బెల్లంపల్లిలో ఆక్సిజన్ ప్లాంట్లు నెలకొల్పారు.

సూపర్‌స్పెషాలిటీ వైద్యానికి ఏటా రూ.259కోట్లు

సింగరేణి ఉద్యోగుల సూపర్‌స్పెషాలిటీ వైద్యానికి సింగరేణి యాజమాన్యం ఏటా రూ.259కోట్లు ఖర్చు చేస్తోంది. దీనికోసం రాష్ట్రంలోని 126సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో ఒప్పందం చేసుకుంది. అంతే కాకుండా సింగరేణి ప్రధాన ఆసుపత్రుల్లో రూ.6.25కోట్లతో ఆధునిక వైద్య పరికరాలను కొనుగోలు చేసింది. మూడు రీజియన్లలోని ఏరియా ఆసుపత్రులకు రూ.2.30కోట్లతో కంటి పరీక్షలకు సంబంధించిన గ్రీన్ లేజర్, యాగ్, నేచర్‌ఫండస్, కెమెరాలు, డిజిటల్ ఎక్స్‌రే యూనిట్లు, షుగర్ పరీక్షలు వేగవంతంగా నిర్వహించే హెచ్‌బీఏ 1సీ యంత్ర విడి భాగాలను తెప్పించింది.

యువ ఉద్యోగులకు పెద్ద పీట

కారుణ్య నియామకాలతో సింగరేణిలో యువ ఉద్యోగుల సంఖ్య భారీగా పెరిగింది. 2015నుంచి 2022 వరకు 58 ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ల ద్వారా 4,207మందికి నేరుగా ఉద్యోగాలు కల్పించింది. కారుణ్య నియామకాల ద్వారా 15,256మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయి. ఏప్రిల్–23నాటికి వంద మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసి అనారోగ్య కారణాలతో ఉద్యోగాలు చేయలేని కార్మికులను అన్‌ఫిట్ చేసి వారి వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించింది.

సొంతింటి నిర్మాణానికి వడ్డీలేని రుణం

సింగరేణి కార్మికులు ఇళ్లు నిర్మించుకుంటే రూ.10లక్షల వరకు వడ్డీలేని రుణాలను యాజమాన్యం అందిస్తోంది. ఇలా సంస్థ వ్యాప్తంగా 6,100మంది కార్మికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. అలాగే సింగరేణి కార్మికుల క్వార్టర్లలో ఏసీలు బిగించుకోవడానికి విద్యుత్ లైన్లను ఆధునీకరించింది. రూ.48.31 కోట్లతో ఏసీ కోసం దరఖాస్తు చేసుకున్న 27,721 క్వార్టర్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చింది. 2018 మార్చి నుంచి ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తోంది. గతంలో ఉన్న నామమాత్రపు విద్యుత్ బిల్లులను పూర్తిగా నిలిపివేసింది. ఇందుకు సంస్థ ఏటా రూ.47.16కోట్ల విలువైన విద్యుత్ అందిస్తోంది.

సింగరేణిలో నూతన ఉద్యోగాలు	19,463
డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా	4,207
కారుణ్య నియామకాల ద్వారా	15,256

కారుణ్య నియామకాలు

2014	674	2019	2,998
2015	1,989	2020	1,661
2016	783	2021	2,111
2017	934	2022	1,988
2018	1,663	2023(ఏప్రిల్)	455
మొత్తం	15,256		

ఇంటింటికీ జాతీయ జెండాల పంపిణీ

- పంచాయతీలకు చేరుతున్న జెండాలు
- జిల్లాలో 51 వేల జెండాల పంపిణీ



పంచాయతీలకు జాతీయజెండాలను అందిస్తున్న డీపీవో చంద్రమౌళి

పెద్దపల్లిరూరల్: ఈనెల 15న స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ప్రతిఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేందుకు అధికారయంత్రాంగం ఇంటింటికీ జెండాలు పంపిణీ చేసేందుకు కార్యాచరణ చేపట్టింది. జిల్లాలోని 266 పంచాయతీల్లో 1,59,414 ఇళ్లు ఉండగా.. ఆదివారం పలు మండలాలు, గ్రామాల్లో 51వేల జెండాలను పంపిణీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. సోమవారం వరకు జెండాల పంపిణీ పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి మండలంలోని 30 పంచాయతీలకు 6,120, అంతర్గాంలో 2,560, ధర్మారంలో 5,308, ఎలిగేడులో 2,370, జూలపల్లిలో 3,300, కమాన్‌పూర్‌లో 2,455, మంథనిలో 4,490, ముత్తారంలో 2,740, ఓదెలలో 4,420, పాలకుర్తిలో 3,830, రామగిరిలో 4,732, శ్రీరాంపూర్‌లో 4,210, సుల్తానాబాద్‌లో 4,465 జెండాలు పంపిణీ చేశారు.

రైతు సంక్షేమానికే ప్రాధాన్యం



సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ సురేందర్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మరిన్ని మెరుగైన వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మార్కెట్ కమిటీ పాలకమండలి తొలి సమావేశం ఆదివారం కమిటీ చైర్మన్ జడల సురేందర్ అధ్యక్షతన జరిగింది. మార్కెట్ కమిటీలో చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. రూ.60లక్షలతో ఒకటో అంతస్తు నిర్మాణం, రూ.31లక్షలతో డ్రైనేజీల పనులు, రూ.60లక్షలతో సీసీరోడ్లు, రూ.51లక్షలతో షెడ్ల నిర్మాణం, రూ.10లక్షలతో వే బ్రిడ్జి ఏర్పాటు, రూ.52లక్షలతో ప్లాట్‌ఫాం నిర్మాణాలు చేపట్టాలని తీర్మానించారు. ఈనెలలో స్టడీటూర్ కోసం కర్ణాటకలోని బెంగళూరు మార్కెట్‌యార్డులను సందర్శించాలని నిర్ణయించారు. రైతులు పండించిన దిగుబడులను అమ్ముకునేందుకు యార్డుకు వచ్చే రైతులకు అవసరమైన వసతులు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చైర్మన్ తెలిపారు. ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్, డీఎంఓ ప్రవీణ్‌రెడ్డి, ఏడీఏ శ్రీనాథ్‌తో పాటు డైరెక్టర్లు కృష్ణమూర్తి, సరోత్తంరెడ్డి, రాములు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
చెక్ డ్యాం నిర్మాణానికి భూమిపూజ

జూలపల్లి: సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో ఆదివారం గంగపుత్రుల బోనాల జాతరలో పాల్గొని గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. రూ.3లక్షల నిధులతో నిర్మించనున్న చెక్ డ్యాం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను గడపగడపకూ అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో గంగపుత్రుల సంఘం అధ్యక్షుడు పెద్దపల్లి రాజేందర్, మాజీ సర్పంచ్ సత్యసాగర్, రాములు, సత్తయ్య, అనందం, రవీందర్, పూరెల్ల గంగయ్య, తొగరు శ్రీనివాస్, కల్లెపెల్లి లింగయ్య, జెల్ల కనుకయ్య, మద్దెల నరేశ్, గున్నాల రాజు పాల్గొన్నారు.

ప్రజలు బీఆర్‌ఎస్ పాలనను కోరుకుంటున్నారు

పెద్దపల్లిరూరల్: పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలంతా బీఆర్‌ఎస్ పాలననే కోరుకుంటున్నారని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలోని ఎమెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో హన్మంతునిపేట, పెద్దబొంకూర్ తదితర గ్రామాలకు చెందిన పలువురు నాయకులకు కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు బండారి శ్రీనివాస్, మేకల లక్ష్మణ్, విక్రం, బండి సతీశ్, పూదరి శ్రీనివాస్, సురేశ్, మధునయ్య, మల్లేశ్, రామరాజు, సరోత్తంరెడ్డి, సంపత్, రాయమల్లు ఉన్నారు.

క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ

పాలకుర్తి: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. ఆదివారం బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద ఫోర్‌లేన్ రహదారిపై ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ చేయడంతోపాటు పూర్తిస్థాయిలో ధ్రువపత్రాలు లేని, పెండింగ్ చలాన్లు ఉన్న వాహనదారులకు జరిమానా విధించారు. ప్రతిఒక్కరూ విధిగా వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండి, తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సీఐ సూచించారు.

ప్రమాదకరంగా కల్వర్టు



గోడ కూలిన కల్వర్టు

ముత్తారం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముత్తారం మండలంలోని మంథని–కేసనపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డులో గల ఎస్సారెస్పీ కాలువ కల్వర్టు గోడ కూలిపోయి, ప్రమాదకరంగా మారింది. 20 రోజులైనా సంబంధిత అధికారులు గోడ తిరిగి నిర్మించడం లేదని, తాత్కాలిక ప్రమాద సూచికలు పెట్టి, వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గోదావరిలో రిటైర్డ్ కార్మికుడి మృతదేహం



శంకరయ్య (ఫైల్)

యైటింక్లయిన్ కాలనీ: గోదావరిఖని రమేశ్‌నగర్‌కు చెందిన చెల్పూరి శంకరయ్య(64) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మూడు రోజుల క్రితం గోదావరి నదిలో దూకగా ఆయన మృతదేహం లభ్యమైంది. గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరయ్య కొంత కాలంగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. మూడుసార్లు ఆపరేషన్ చేయించుకున్నా తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 10న మందుల దుకాణానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి, వెళ్లాడు. తర్వాత గోదావరి బ్రిడ్జి వద్దకు చేరుకొని తన చెప్పులు, టవల్ అక్కడే వదిలేసి, నదిలో దూకాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించినా ఆయన ఆచూకీ లభించలేదు. చివరకు ఆదివారం జాలర్ల సాయంతో గోదావరి నదిలో వెతకగా బ్రిడ్జి కింద శంకరయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులు బయటకు తీయించి, పోస్టుమార్టం చేయించారు. మృతుడి కుమారుడు సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్సై ప్రసాద్‌రావు తెలిపారు.

చెరువులు నిండుగా.. ‘బీడు’ పచ్చగా

విస్తారంగా కురిసిన వర్షాలతో నిండుకుండలా జలవనరులు

- ఎస్సారెస్పీ డీ–86 కెనాల్ ద్వారా తొలుత చివరి ఆయకట్టుకు నీరు
- సాగులోకి వచ్చిన బీడు భూములు
- జిల్లాలో 1,016 చెరువులు



సాగులోకి వచ్చిన బీడు భూములు



నిండుకుండలా సుల్తానాబాద్ చెరువు

సుల్తానాబాద్: పక్షం రోజులపాటు విస్తారంగా కురిసిన వర్షాలతో జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో సమృద్ధిగా నీరు చేరింది. జలవనరులన్నీ నిండుకుండలా మారాయి. దీంతో పంట చేలకు మేలు జరగడంతోపాటు సాగు, తాగునీటి కష్టాలు తొలగిపోయాయి. దీనికితోడు ఎస్సారెస్పీ ద్వారా నీరు రావడంతో కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల రైతులకు చెందిన బీడు భూములు సాగులోకి వచ్చాయి.

పెరిగిన భూగర్భజలాలు

పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 1,016 చెరువులు, 3 ప్రాజెక్టుల్లోకి వరద నీరు భారీగా చేరిందని సాగునీటి విభాగం అధికారులు తెలిపారు. ఫలితంగా భూగర్భజలాలు పెరిగాయి. మానేరు నదిపై పలు ప్రాంతాల్లో నిర్మించిన 11 చెక్‌డ్యాంలలో పుష్కలంగా నీరు నిలిచింది. ఇక ఏడాదంతా వర్షాలు లేకున్నా పంటలకు ఇబ్బంది ఉండదని రైతులు చెబుతున్నారు.

నీటిని కాపాడుకోవాలి

చెరువులు, కుంటల్లో ప్రస్తుతం ఉన్న నీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయకట్టు రైతులతోపాటు ఆయా గ్రామాల ప్రజలదేనని అధికారులు అంటున్నారు. చెరువు పక్కనున్న పొలాల వారు తూముల నుంచి రాత్రివేళలో నీటిని వదులుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. మరికొన్నిచోట్ల తూముల లీకేజీతో నీరు వృథాగా పోతోందని పేర్కొంటున్నారు.

బీడు భూములు సాగులోకి..

జిల్లాకు ఎస్సారెస్పీ వరప్రదాయిని. ఈ ప్రాజెక్టు కాల్వల కిందనే రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఏళ్లుగా వీటి టెయిలెండ్ ప్రాంతాలకు సాగు నీరందడం లేదు. కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లోని 46 గ్రామాలు ఈ పరిస్థితిని ఎదుర్కొంటుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో అధికారులు ఎస్సారెస్పీ డీ–86 కాల్వ ద్వారా చివరి భూములకు నీరందించిన తర్వాతే పైన ఉన్న రైతుల భూములకు వదలాలని నిర్ణయించి, అమలు చేశారు. దీంతో బీడు భూములు సాగులోకి వచ్చి, అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇకనుంచి కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లో 76,853 వేల ఎకరాల భూముల్లో ఏటా రెండు పంటలు పండనున్నాయి. పంటలు ఎండిపోకుండా ఉండేందుకు అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు.

ఇతర దేశాల్లోని ప్రాజెక్టుల్లో అమలు..

ఎస్సారెస్పీ అధికారులు అమలు చేస్తున్న కొత్త విధానాన్ని ఇతర దేశాల్లోని ప్రాజెక్టుల్లో అక్కడి అధికారులు అమలు చేస్తున్నారు. ఆయకట్టు చివరి భూములకు ముందు ప్రాధాన్యం ఇచ్చి, తర్వాత పైన ఉన్న రైతుల భూములకు నీరు ఇస్తుండటంతో అన్ని రకాల పంటలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగయ్యే అవకాశాలు ఉన్నాయి.

క్రీడా ప్రాంగణాలకు కిట్లు



కరీంనగర్ సప్తగిరికాలనీలోని తెలంగాణ క్రీడా ప్రాంగణం

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు 1,549 మంజూరు
- త్వరలో అందించనున్న అధికారులు

ఉమ్మడి జిల్లా సమాచారం

జిల్లా	మంజూరైన కిట్లు
జగిత్యాల	553
కరీంనగర్	434
రాజన్న సిరిసిల్ల	307
పెద్దపల్లి	255



జగిత్యాల జిల్లాకు చేరిన క్రీడా కిట్లు

కరీంనగర్ స్పోర్ట్స్: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఔత్సాహిక క్రీడాకారులను క్రీడల్లో తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు శ్రీకారం చుట్టింది. గ్రామం, మున్సిపాలిటీ వార్డుల్లో ఎకరం స్థలంలో దాదాపు రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేసి, వీటిని తీర్చిదిద్దారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులతోపాటు లాంగ్‌జంప్ పిట్, సింగిల్ ఎక్సర్‌సైజ్ బార్‌లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 312 గ్రామాల్లో ఈ ప్రాంగణాలు అందుబాటులోకి వచ్చాయి.

12 రకాల సామగ్రి..

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు క్రీడా కిట్లు త్వరలో పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు కిట్లు రాగా కరీంనగర్‌కు రేపోమాపో రానున్నాయి. కిట్‌లో క్రికెట్‌కు సంబంధించి 12 రకాల సామగ్రి, వాలీబాల్ కిట్‌లో నెట్, బాల్స్, ఫుట్‌పంప్, టేప్‌తోపాటు జిమ్‌కు సంబంధించి 30 కిలోల మూడు సెట్ల డంబెల్స్, 1, 2 కేజీల డిస్కస్‌త్రోలు, 6 టెన్నికాయిట్ రింగ్స్, 4 స్కిప్పింగ్ రోప్, 3 విజిల్స్, ఒక స్టాప్‌వాచ్, కిట్ బ్యాగ్‌తోపాటు క్రీడాకారులకు 75 టీషర్టులు ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు క్రీడా కిట్లు అందనుండటంతో గ్రామీణ క్రీడాకారులు రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసుకునే అవకాశం ఏర్పడింది. దీంతో వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతారు. క్రీడా కిట్లను సద్వినియోగం చేసుకోవాలి.

– కీర్తి రాజవీరు, డీవైఎస్‌వో, కరీంనగర్

ఔత్సాహిక క్రీడాకారులకు వేదిక



క్రీడా ప్రాంగణాలు ఔత్సాహిక క్రీడాకారులకు ఒక వేదికలా ఉపయోగపడనున్నాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ద్వారా క్రీడా ప్రాంగణాలకు క్రీడా కిట్లు వచ్చాయి. త్వరలో పంపిణీ చేస్తాం. క్రీడాకారులు క్రీడా ప్రాంగణాల్లో ప్రాక్టీస్ చేయాలి.

– రవి, డీవైఎస్‌వో, జగిత్యాల

సింగరేణి ఉత్తమ కార్మికులు వీరే..



మధుసూదన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, రాంబాబు, శ్రీనివాస్, రవి, కొమురయ్య, మహేందర్‌రెడ్డి, రాజశేఖర్, వి.రాజ్‌కుమార్, బి.రాజ్‌కుమార్, గుండ్ల రాజు, ఎల్.కనకరాజు, ధర్ముల శంకర్, దినేశ్ సింగ్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని ఉత్తమ కార్మికుల పేర్లను యాజమాన్యం ప్రకటించింది. ఏరియాలోని జీడీకే–1, 3 గనిలో హెడ్ వైన్‌మెన్‌గా పని చేస్తున్న దొడ్డపనేని మధుసూదన్‌రావు, ట్రామర్ మందల శ్రీనివాస్‌రెడ్డి, జీడీకే–2, 2ఏ గనిలో జనరల్ మజ్దూర్ మిట్టపెల్లి మహేశ్, సపోర్ట్‌మెన్ తోకల రాంబాబు, జీడీకే–11 గనిలో ఎలక్ట్రీషియన్ సందెవేని శ్రీనివాస్, సపోర్ట్‌మెన్ ఉసికమల్ల రవి, జీడీకే–5 ఓసీపీకి చెందిన ఈపీ ఆపరేటర్ పల్లెర్ల కొమురయ్య, జనరల్ మజ్దూర్ తుమ్మల మహేందర్‌రెడ్డి, జీడీకే–1 సీహెచ్‌పీలో ఎలక్ట్రీషియన్ బొర్ర రాజశేఖర్ ఎంపికయ్యారు. వీరిని స్వాతంత్య్ర దినోత్సవం రోజు ఆర్జీ–1 కమ్యూనిటీ హాలులో జీఎం చింతల శ్రీనివాస్ సన్మానించనున్నారు.

ఆర్జీ–2 ఏరియాలో ఆరుగురు..

సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలో ఆరుగురిని ఉత్తమ ఉద్యోగులుగా యాజమాన్యం ఆదివారం ప్రకటించింది. ఓసీపీ–3లో ఈపీ ఆపరేటర్ వి.రాజ్‌కుమార్, ఫోర్‌మెన్ బేతి రాజకుమార్, వకీల్‌పల్లి గనిలో గొండ్ల రాజు, ఎలక్ట్రీషియన్ ఎల్.కనకరాజు, సీహెచ్‌పీలో జనరల్ మజ్దూర్ ధర్ముల శంకర్ ఎంపికయ్యారు. వీరిని స్వాతంత్య్ర దినోత్సవం రోజు యైటింక్లయిన్‌కాలనీ కమ్యూనిటీ హాలులో జీఎం మనోహర్ సన్మానించనున్నారు. అలాగే ఉత్తమ సింగరేణియన్‌గా ఓసీపీ–3 ఈపీ ఆపరేటర్ దినేశ్‌సింగ్ ఎంపికయ్యారు. ఈయనను కొత్తగూడెంలో జరిగే సెంట్రల్ ఫంక్షన్‌లో డైరెక్టర్లు సత్కరించనున్నారు.

ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచి కార్యదర్శిగా పోషం



పోషం

గోదావరిఖని: ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచి కార్యదర్శిగా ఆరెల్లి పోషం ఎన్నికయ్యారు. ఆదివారం గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏరియా నూతన కమిటీని ఎన్నుకున్నారు. బ్రాంచి ఇన్‌చార్జిగా మడ్డి ఎల్లాగౌడ్, ఉపాధ్యక్షులుగా మాదన మహేశ్, సంకె అశోక్, సహాయ కార్యదర్శిగా రంగు శ్రీనివాస్, కోశాధికారిగా ఎస్.వెంకట్‌రెడ్డిలను ఎన్నుకున్నట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం



డ్రైవర్లను అభినందిస్తున్న మక్కాన్ సింగ్

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ సెంటర్‌లో ఆదివారం సింగరేణి ఆర్జీ–1లోని కాంట్రాక్ట్ కన్వెయన్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 20 మంది డ్రైవర్లు రక్తదానం చేశారు. డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాతలను మక్కాన్ సింగ్ అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఇండ్ల ఓదెలు, కాంగ్రెస్ బీసీ సెల్ నాయకులు గట్ల రమేశ్, పెండ్యాల మహేశ్, కౌటం సతీశ్, నాజిం, సిరిశెట్టి సతీశ్, తిరుపతి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ మహేందర్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికుల హక్కులు సాధించడంలో కీలక పాత్ర పోషించిన నాయకుడు కామ్రేడ్ కేఎల్ మహేందర్ 16వ వర్ధంతిని ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం కేంద్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఎల్.ప్రకాశ్, బ్రాంచి కార్యదర్శి రాజారత్నం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. కామ్రేడ్ మహేందర్ ఏఐటీయూసీకి, కార్మికులకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అన్నారావు, శ్యాంసన్, తిరుపతి, కృష్ణ, వెంకటేశ్, దుర్గయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఈ నెల 19న ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి భాస్కర్, ప్రధాన కార్యదర్శి పోగుల విజయకుమార్ కోరారు. ఆదివారం పెద్దపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. జిల్లా కేంద్రంలో ఫొటో భవన్ నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఇందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. నాయకులు వనపర్తి శ్రీనివాస్, చంద్రమౌళి, పల్లెర్ల ఉదయ్, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలను ఉత్సవంలా జరపాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్



మొక్కలు నాటుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: స్వాతంత్య్ర వేడుకలను ఉత్సవంలా జరపాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలారపు పర్వతాలు కోరారు. మేరీ మటీ.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. పెద్దపల్లిలో ఆదివారం పార్టీ నాయకులతో కలిసి, మొక్కలను నాటారు. ఈ నెల 30 వరకు స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మట్టి, మొక్కలను సేకరించి ఢిల్లీలోని అమరవీరుల స్మృతివన సమీపంలో ప్రత్యేక స్తూపం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నాయకులు సంపత్‌రావు, సంపత్‌రెడ్డి, మహంతకృష్ణ, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, కిరణ్, శ్రీనివాస్, సతీశ్ తదితరులున్నారు.

జగిత్యాల ఎస్పీకి డీజీపీ అభినందన



కుమారుడి ఫొటోతో అవగాహన కల్పిస్తున్న ఓ తల్లి

జగిత్యాలక్రైం: ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం.. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం... ట్రిపుల్ రైడింగ్‌తో ప్రమాదాలకు గురై మృతిచెందితే ఆ కుటుంబం పడే బాధలను ప్రజలకు వివరిస్తూ ఎస్పీ భాస్కర్ ‘చేజారిన కొడుకు’..అనే పాటను రాశారు. ఈ సీడీని శుక్రవారం సాయంత్రం డీజీపీ అంజన్ కుమార్ విడుదల చేయడంతోపాటు ఎస్పీ భాస్కర్‌ను ట్విట్టర్‌లో ప్రత్యేకంగా అభినందించారు.



ట్రాఫిక్ రూల్స్‌పై లోగో

‘ఉమ్మడి’ షూటింగ్ బాల్ పోటీలకు స్పందన



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్: షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని సప్తగిరికాలనీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన 42వ అండర్–19 ఉమ్మడి జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు స్పందన లభించింది. 250 మందికి పైగా క్రీడాకారులు హాజరైనట్లు సంఘం కార్యదర్శి ఎండీ.ముఫాజిల్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 20న జనగాం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు ఇనాక్, శ్రీధర్, మహేశ్, రమేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో సింగరేణి విఫలం

రామగిరి: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఆకుల వెంకన్న ఆరోపించారు. ఆదివారం ఆర్జీ–3లోని నర్సరీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సరీ, ఇతర విభాగాల్లో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 250 మంది నర్సరీ కార్మికులు పని చేస్తున్నారని, వీరి పనికి భద్రత లేదని తెలిపారు. హామీలు అమలు చేయాలని పలు దఫాలుగా సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, కనీస వేతనం, బోనస్, పీఎఫ్, వైద్యం వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న జీఎం కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులు పి.లక్ష్మి, రాజమ్మ, రాణి, పద్మ, శివమ్మ, జి.లక్ష్మి పాల్గొన్నారు.

సీఎం పెద్దపల్లి నుంచి పోటీ చేయాలి



మాట్లాడుతున్న సురేందర్ సన్నీ

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ పెద్దపల్లి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాలని కోరుతూ ఈ నెల 26న భీమ్ గర్జన ర్యాలీ నిర్వహిస్తున్నామని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంకూరి సురేందర్ సన్నీ తెలిపారు. ఆదివారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో కౌన్సిలర్లు బొంకూరి భాగ్యలక్ష్మి, ఈరబోయిన శ్రీనివాస్‌లతో కలిసి, మాట్లాడారు. సహజ వనరులు, పారిశ్రామిక ప్రాంతం కలిగి ఉన్న పెద్దపల్లిని జిల్లా కేంద్రంగా ప్రకటించారని అన్నారు. ర్యాలీని విజయవంతం చేసి, సీఎం కేసీఆర్ పెద్దపల్లి నుంచి పోటీ చేసేందుకు ఆహ్వానించాలని పిలుపునిచ్చారు. బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి జెండా కూడలిలోని కాన్షీరాం విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. సీఎం పెద్దపల్లికి ప్రాతినిధ్యం వహిస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

చలో హైదరాబాద్‌కు బల్దియా సిబ్బంది



హైదరాబాద్ వెళ్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి తరలివెళ్లారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించాలని, రెగ్యులరైజ్ చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు జనగామ లింగయ్య, ఉదయ్ డిమాండ్ చేశారు. నాయకులు రవి, శశికుమార్, శ్రీనివాస్, సారయ్య, యూసుఫ్, రాజబాబు, రాయమల్లు, సాగర్, విజయ్, తార, మాధవి, లలిత, లత, రూప పాల్గొన్నారు.

పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి



క్రీడాకారులతో జీఎం సుధాకర్‌రావు

రామగిరి: చిన్నారులు క్రీడాస్ఫూర్తితో ముందుకుసాగుతూ క్రీడల్లో రాణించాలని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం సెంటినరీకాలనీ రాణీ రుద్రమదేవి స్టేడియంలో అండర్–14 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. పిల్లలు చిన్నప్పటి నుంచే ఆటలపై ఆసక్తి పెంచుకునేలా తల్లిదండ్రులు, గురువులు ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తన్నీరు ప్రదీప్, గండి శ్రీనివాస్, పొలెటి రవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ మీట్ ఫుట్‌బాల్ టీం ఎంపిక



రామగుండం: ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు వనపర్తి జిల్లా పెబ్బేర్‌లో జరిగే సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ మీట్‌కు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే ఫుట్‌బాల్ టీంను ఆదివారం ఎంపిక చేసినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గణపతి తెలిపారు. టీటీఎస్ అంతర్గాం క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ తదితరులున్నారు.